ఆగాఖాన్ మృతికి మాజీ హోంమంత్రి సంతాపం

అబిడ్స్, ఫిబ్రవరి 7 : ఆగాఖాన్ మృతికి రాష్ట్ర మాజీ హోంమంత్రి మహమూద్ అలీ సంతాపం తెలిపారు. శుక్రవారం చిరాక్ ఇస్మాయిల్ జమాత్ కార్యాలయంలో జమాత్ ప్రతినిధులను కలిసి సంతాపాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా మాజీ హోం శాఖ మంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ.. ఆగాఖాన్ మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర మైనార్టీ నాయకులు ఎంకే బద్రుద్దీన్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే తలసానికి ఆహ్వాన పత్రిక అందజేత

బేగంపేట్, ఫిబ్రవరి 7: సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి ఆలయంలో జరగనున్న కోటి కుంకుమార్చనకు రావాలని దేవాలయ ఈఓ, అర్చకులు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. శుక్రవారం మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తలసానిని కలిసి ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో రాంగోపాల్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్, అర్చకులు పాల్గొన్నారు.

నేడు కాచిగూడలో జాతీయ సదస్సు

కాచిగూడ, ఫిబ్రవరి 7: బర్కత్‌పుర అవంతి డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో కాంక్లేవ్-2025 పేరుతో కాచిగూడ మున్నూరుకాపు సంఘం హాల్‌లో శనివారం జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ సాయిరాం ఒక ప్రకటనలో తెలిపారు. బిట్స్‌పిలానీ డైరెక్టర్ ప్రొఫెసర్ ముఖర్జీ, ఓయూ ఉమెన్ క్యాపిటల్ డైరెక్టర్ ప్రొఫెసర్ సీవీ ఎంఎస్ రజని, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్, అవంతి కళాశాలల వ్యవస్థాపకుడు, చైర్మన్ ఎం.శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

ఎన్‌ఎల్‌ఎం పథకంపై అవగాహన కల్పించాలి

• పశు సంవర్ధక,పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్

సుల్తాన్‌బజార్,ఫిబ్రవరి 7 : ఎన్‌ఎల్‌ఎం పథకంలో దరఖాస్తు చేసిన పశు పోషకులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి వారి అభివృద్ధికి పాటుపడాలని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్ జిల్లా అధికారులకు సూచించారు. శుక్రవారం మాసబ్ ట్యాంక్‌లోని రాష్ట్ర పశు సంవర్ధకశాఖ ప్రధాన కార్యాలయంలో జూమ్ మీటింగ్‌తో వివిధ జిల్లాల పశువైద్యాధికారులతో ఎన్‌ఎల్‌ఎం పథకంపై రాష్ట్ర స్థాయి కార్యనిర్వాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్‌ఎల్‌ఎం-ఈడీపీలో పశు సంవర్ధకశాఖకు వచ్చిన 85 దరఖాస్తులను అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి 81 ప్రాజెక్టులను కేంద్ర స్థాయిలో మంజూరుకు సిఫారసు చేశారన్నారు. రాష్ట్ర స్థాయి కమిటీ సిఫారసుపై కేంద్ర కమిటీ పరిశీలించి తగిన మంజూరీ లభించిన అనంతరం మాత్రమే ఆయా ప్రాజెక్టులను ప్రారంభించాల్సిన అవసరం ఉంటుందన్నారు. కేంద్ర కమిటీ మంజూరు చేసిన ప్రాజెక్టులకే సబ్సిడీ లభిస్తుందని లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని జిల్లా అధికారులకు సూచించారు.

సమావేశంలో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ బీ. గోపి, పశుగణాభివృద్ధి సంస్థ ముఖ్య కార్యనిర్వాహణాధికారి డాక్టర్ మల్లీశ్వరీ, గొర్రెలు, మేకల పెంపకందారుల సమాఖ్య ఎండీ డాక్టర్ బీ. సుబ్బరాయుడు,పీవీఎన్‌ఆర్‌టీవీయూ డీఆర్ డాక్టర్ హరిక్రిష్ణతోపాటు ఇతర ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పశు వైద్యాధికారులతో జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్, చిత్రంలో శాఖ సంచాలకులు డాక్టర్ బి గోపి

అధికారులు అందుబాటులో ఉండటం లేదు..

• బీఆర్ఎస్ గోషామహల్ నాయకుడు ఎం. ఆనంద్‌కుమార్‌గౌడ్

జీహెచ్ఎంసీ కార్యాలయ ఆవరణలో మీడియాతో మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్, ఫిబ్రవరి 7: జీహెచ్ఎంసీ సర్కిల్-14 కార్యాలయంలో ప్రజా సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యారని బీఆర్ఎస్ గోషామహల్ నియోజకవర్గ నాయకుడు ఎం ఆనంద్ కుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం జీహెచ్ఎంసీ కార్యాలయం ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడారు. జీహెచ్ఎంసీ సర్కిల్-14 ఇన్‌చార్జి డిప్యూటీ మున్సిపల్ అధికారితో పాటు ఏఎంహెచ్ఓ, టాక్స్ సెక్షన్ అధికారులు ఎవరూ అందుబాటులో ఉండ టంలేదని ఆయన ఆరోపించారు.

సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు సందర్శన వేళలని చెబుతున్న అధికారులు ఆ సమయంలో కూడా అందుబాటులో ఉండకపోవడంతో స్థానిక సమస్యలను ఎవరికి ఫిర్యాదు చేయాలని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో గోషామహల్ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నియోజకవర్గంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. నియోజకవర్గంలో వెలగని స్ట్రీట్ లైట్లతో బస్తీలు అంధకారమయ్యాయని, రోడ్లు అధ్వానంగా మారాయని, డ్రైనేజీలు పొంగి పొర్లుతూ మురుగునీరు ఏరులై ప్రవహిస్తుందని, తాగునీటితో కలిసి మురుగునీరు సరఫరా అవుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ కమిషనర్ జోక్యం చేసుకొని వెంటనే సర్కిల్-14 డిప్యూటీ మున్సిపల్ కమిషనర్‌ను నియమించాలన్నారు. సందర్శన వేళల్లో అధికారులు కచ్చితంగా సెక్షన్ ఆఫీస్‌లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విజయ్ ముదిరాజ్, మహేశ్‌గౌడ్, రాకేశ్‌సింగ్, నరేశ్, గిరీశ్ తదితరులు పాల్గొన్నారు

విద్యుత్ సమస్యల్లేకుండా చర్యలు తీసుకోవాలి

ఆబిడ్స్, ఫిబ్రవరి 7: రానున్న రంజాన్ మాసంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. శుక్రవారం విద్యుత్‌శాఖ అధికారులతో ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ సమావేశమయ్యారు. రంజాన్‌మాసం సమీపిస్తుండటంతో బస్తీలు, కాలనీల్లో విద్యుత్ సమస్యల్లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. సమావేశంలో నానల్‌నగర్ కార్పొరేటర్ నసీరుద్దీన్, దక్షిణ, సెంట్రల్ మండలం ఎస్ఈలు సోమిరెడ్డి, వెంకన్న, మెహిదీపట్నం, బేగంబజార్ డీఈలు సుధీర్, ఫర్హత్ అలీ, ఏడీలు, ఏఈలు పాల్గొన్నారు.

విజయనగర్‌కాలనీ ప్రభుత్వ పాఠశాలకు 'ఐడీబీఐ' చేయూత

పాఠశాలలో కంప్యూటర్ పరికరాలు అందజేస్తున్న ఐడీబీఐ బ్యాంక్ ఏజీఎం విశ్వనాథ్ ప్రభు, మెహిదీపట్నం బ్రాంచ్ హెడ్ షేక్ షరీఫ్ తదితరులు

అబిడ్స్, ఫిబ్రవరి 7 : హైదరాబాద్ నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు, కంప్యూటర్ ఆధారిత విద్యను మెరుగుపరిచేందుకు అవసరమైన పరికరాలను అందజేస్తున్నట్లు ఐడీబీఐ బ్యాంక్ ఏజీఎం విశ్వనాథ్ ప్రభు తెలిపారు. ఐడీబీఐ బ్యాంక్ సపోర్టింగ్ ఎడ్యుకేషన్ ఫర్ ఎంపవర్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్(సీడ్) కార్యక్రమాన్ని చేపట్టి దేశవ్యాప్తంగా రూ.30 కోట్లతో 2 వేల బ్రాంచ్‌ల్లో సీఎస్ఆర్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా శుక్రవారం విజయనగర్ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో ఐడీబీఐ మెహిదీపట్నం బ్రాంచ్ హెడ్ షేక్ షరీఫ్‌తో కలిసి రూ.1.75 లక్షల విలువైన కంప్యూటర్, ప్రింటర్, స్కానర్, బీరువాలు, ఐరన్ ర్యాక్‌లు, గ్రీన్ బోర్డులు, స్టెబిలైజర్, గ్లోబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఏజీఎం మాట్లాడుతూ.. నగరంలోని 30 ప్రభుత్వ పాఠశాలల్లో రూ.42 లక్షలతో 24 ఐడీబీఐ బ్రాంచ్‌లు సీఎస్ఆర్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ రమణరాజు, పాఠశాల ప్రిన్సిపాల్ సులేమాన్, ఉపాధ్యాయులు,ఐడీబీఐ బ్యాంక్ అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

42 మంది అడ్వకేట్లు ప్రాక్టీస్‌కు అనర్హులు

• హైకోర్టు బార్ కౌన్సిల్ కార్యదర్శి వి.నాగలక్ష్మి వెల్లడి

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, ఫిబ్రవరి 7(నమస్తే తెలంగాణ): తెలంగాణ హైకోర్టులో న్యాయవాదులుగా ప్రమాణం చేసినప్పటికీ ఆలిండియా బార్ ఎగ్జామ్‌లో పాస్ కాని 42 మంది న్యాయవాదుల జాబితాను హైకోర్టు బార్ కౌన్సిల్ కార్యదర్శి వి.నాగలక్ష్మి శుక్రవారం వెల్లడించారు. 42మంది న్యాయవాదులు రాష్ట్రంలోని అన్ని కోర్టుల్లో ప్రాక్టీసు చేయడానికి వీలులేదని, బార్ కౌన్సిల్ తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జూలై 2010 నుంచి 2022 వరకు ఉన్న జాబితా ప్రకారం 42మంది అడ్వకేట్లు పరీక్షలో ఉత్తీర్ణులు కాలేదని రికార్డులు చెబుతున్నట్టు వివరించారు. ఏఐబీఈ (ఆలిండియా బార్ ఎగ్జామ్) పాస్ అయ్యేంతవరకు 42మంది అడ్వకేట్లు ప్రాక్టీస్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ఈ మేరకు బార్ అసోసియేషన్లు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఈఎస్ఐని సొసైటీగా మార్చొద్దు..

బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 7: బీమా వైద్య సేవలశాఖను మూసివేసి కేంద్ర ప్రభుత్వం కుట్ర పూరితంగా ఈఎస్ఐ సొసైటీ ఏర్పాటు చేయడానికి చేస్తున్న ప్రయత్నాలను తాము వ్యతిరేకిస్తున్నామని బీమా వైద్య సేవలశాఖ (ఈఎస్ఐ) ఉద్యోగులు అన్నారు. శుక్రవారం 11వ రోజు డైరెక్టరేట్ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు.

ఎస్సీ వర్గీకరణలో 57 కులాల గొంతు కోశారు..

• ఎంబీఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు బైరి నరేశ్

రవీంద్రభారతి,ఫిబ్రవరి 7 : ఎస్సీ వర్గీకరణలో ఎంబీ ఎస్సీ కులాల గొంతు కోశారని ఎంబీఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు బైరి నరేశ్ అన్నారు. మాదిగలకు 11 శాతం కావాలంటున్న మందకృష్ణ మాదిగది అత్యాశ అని పేర్కొన్నారు. శుక్రవారం బషీర్‌బాగ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేయాలనే సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డిని అభినందిస్తూనే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం దళితుల్లో అత్యంత వెనుకబడిన కులాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. తమ కులాలను ప్రభుత్వం ఏ గ్రూపులో కలకపోవడంతో మరోసారి తీవ్ర అన్యాయం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం 57 ఎంబీఎస్సీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, రూ. 2 వేల కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమలో అంతోని వెంకన్న డక్కలి, సుద్దాల కుమారస్వామి, శ్రీనివాస్, పాండు, నవీన్, మహేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

షాదీముబారక్ చెక్కుల అందజేత

లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న కార్వాన్ ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్, నానల్‌నగర్ కార్పొరేటర్ నసీరుద్దీన్ తదితరులు

మెహిదీపట్నం, ఫిబ్రవరి 7 : ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడానికి కృషి చేస్తున్నామని కార్వాన్ ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. శుక్రవారం టోలిచౌకీలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో షేక్‌పేట్ తాసీల్దార్ అనితారెడ్డి, నానల్‌నగర్ కార్పొరేటర్ నసీరుద్దీన్‌తో కలిసి 40 మంది లబ్ధిదారులకు షాదీముబారక్, నలుగురికి కల్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసం అధికారులు నిరంతరం కృషి చేయాలన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

వాహెద్‌కాలనీలో సివరేజీ డ్రైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్‌మెరాజ్

చాంద్రాయణగుట్ట,ఫిబ్రవరి 7 : నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని యాకుత్‌పురా నియోజకవర్గం ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెరాజ్ అన్నారు. శుక్రవారం కుర్మగూడ డివిజన్‌లోని అల్ జబ్రీ కాలనీ, సలావుద్దీన్ నగర్‌ల్లో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను, వాహెద్ కాలనీలో చేపట్టిన సివరేజీ లైన్ పనులను ఎమ్మెల్యే కార్పొరేటర్ షఫత్ అలీతో కలిసి పర్యవేక్షించారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

లంగర్‌హౌస్‌లో కారుకు బ్లాక్‌ఫిల్మ్‌ను తొలగిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య

మెహిదీపట్నం ఫిబ్రవరి 7 : వాహనదారులు ట్రాఫిక్ నియమ,నిబంధనలు పాటించాలని లంగర్‌హౌస్ ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య అన్నారు. శుక్రవారం సాయంత్రం లంగర్‌హౌస్ లక్ష్మీనగర్ రింగ్‌రోడ్ చౌరస్తాలో ట్రాఫిక్ పోలీసులు బ్లాక్ ఫిల్మ్, సైరన్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బ్లాక్ ఫిల్మ్ ఉన్న 12 కార్ల యజమానులపై కేసులు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ డ్రైవ్‌లో ఎస్ఐలు రామాంజనేయులు, సాయిశ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

సికింద్రాబాద్, ఫిబ్రవరి7: బౌద్ధనగర్ డివిజన్ పరిధిలో ప్రజల తమ దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నమని కార్పొరేటర్ శైలజ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని వారాసిగూడలో సీసీ రోడ్ నిర్మాణ పనులను ఆమె అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులు కలిసి పరిష్కరిస్తున్నమని తెలిపారు.

కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు ఏఈ లావణ్యతోపాటు బీఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్, రాజేశ్, ఖలీం, సుజాత తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి హాకీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



హైమావతి పాఠశాల విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ రోహిణి

గోల్నాక, ఫిబ్రవరి 7 : హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన హాకీ పోటీల్లో అంబర్‌పేట డివిజన్ హైమావతి పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. శుక్రవారం ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఈవో రోహిణి విజేతలకు బహుమతులు అందజేశారు. హాకీ అండర్-14 విభాగంలో హైమావతి పాఠశాల బాలికలు మొదటి స్థానం సాధించగా.. బాలురు రెండో స్థానంలో నిలిచారు. జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ శ్రీదేవి, పాఠశాల ప్రిన్సిపాల్ నిరంజన్ విజేతలను అభినందించారు.

రేషన్ బియ్యం, గోధుమలు పట్టివేత

రామంతాపూర్,ఫిబ్రవరి 7:అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం, గోధుమలను పట్టుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. శుక్రవారం ఉప్పల్ ఐడీఏ జెర్సీ కంపెనీ ఎదురుగా ఉన్న పార్కింగ్ వద్ద అక్రమంగా నిల్వంచిన 140 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ,10 క్వింటాళ్ల గోధుమలను ఉప్పల్ పోలీసులు పట్టుకున్నారు. డీసీఎం,రెండు అశోక్ లేలాండ్ ట్రక్కులను పట్టుకున్నారు. డ్రైవర్ వెంకటరెడ్డిని అరెస్టు చేసిన పోలీసులు బియ్యాన్ని, గోధుమలను సీజ్ చేసి డ్రైవర్‌ను, మూడు వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న అబ్బును కోసం పోలీసులు గాలిస్తున్నారు.

కాచిగూడ స్పెషల్ రైల్లో చోరీ

కాచిగూడ, ఫిబ్రవరి 7: కాచిగూడ స్పెషల్ రైల్లో ప్రయాణికుడి బంగారు అభరణాలు, నగదును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్ ప్రాంతానికి చెందిన బీడీ అగర్వాల్ కుమారుడు గిరిప్రసాద్ అగర్వాల్(58) స్పెషల్ రైల్లో కాచిగూడకు వస్తుండగా మార్గమధ్య నిజామాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో అతడి బ్యాగును దుండగులు దొంగిలించారు. 22 గ్రాముల బంగారు అభరణాలు, రూ.24 వేలు ఉన్నట్లు తెలిపారు. గురువారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు రైల్వే సీఐ తెలిపారు.

సమస్యలపై జోనల్ కమిషనర్‌కు వినతి

రామంతాపూర్, ఫిబ్రవరి 7: నాచారం డివిజన్‌లోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ కలిసి వినతి పత్రం సమర్పించారు. ఓల్డ్ విలేజ్‌లో రూ54 లక్షలతో సిమెంట్ రోడ్డు వేశామని మిగిలిన రోడ్లకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కొత్త రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు.

ఎగ్జిబిషన్‌ను పొడిగించాలని స్టాల్ హోల్డర్ల వినతి

ఎగ్జిబిషన్ సొసైటీ కార్యాలయం వద్ద స్టాల్ హోల్డర్లు

అబిడ్స్ ఫిబ్రవరి 7 : అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శనను మరో వారం రోజులు పొడిగించాలని స్టాల్ హోల్డర్లు ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఎగ్జిబిషన్ సొసైటీ కార్యాలయంలో ప్రతినిధులను కలిసి తమ సమస్యలను వివరించారు. జనవరి 3న ప్రారంభమైన అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన 15న ముగియనుండగా ఎగ్జిబిషన్ సొసైటీ కేవలం రెండు రోజులు పొడిగిస్తున్నట్లు సమాచారం అందుకున్న స్టాల్ హోల్డర్లు సొసైటీ కార్యాలయానికి చేరుకొని వారం రోజులపాటు ఎగ్జిబిషన్‌ను పొడిగించాలని కోరారు. ప్రతి ఏటా జనవరి ఒకటో తేదీన ప్రారంభం కావాల్సిన ఎగ్జిబిషన్ ఈ ఏడాది మూడో తేదీ నుంచి ప్రారంభమైందని, అంతేకాకుండా వ్యాపారాలు అంతగా లేవని, మరో వారం రోజులు పాటు పొడిగిస్తే బాగుంటుందని అధికారులను కోరారు. తద్వారా తమ ఉత్పత్తులు అమ్ముకోవడానికి ఆస్కారం ఏర్పడుతుందని, సందర్శకులకు ఉపయోగకరంగా ప్రదర్శన ఉంటుందని వారు పేర్కొన్నారు.

టప్పాచబుత్రలో హాష్‌ఆయిల్ విక్రేత అరెస్ట్

టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న కుల్సుంపురా ఏసీపీ మునావర్

కార్వాన్,ఫిబ్రవరి 7: మత్తు కలిగించే హాష్ ఆయిల్‌ను విక్రయిస్తున్న అంతర్‌రాష్ట్ర నిందితుడిని టప్పాచబుత్ర పోలీసులు దక్షిణ, పశ్చిమ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసుల సహకారంతో శుక్రవారం పట్టుకుని అరెస్ట్ చేశారు. అతడి వద్ద 1100 గ్రాముల హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

టప్పాచబుత్ర పోలీస్ స్టేషన్‌లో కుల్సుంపురా ఏసీపీ మునావర్,ఇన్‌స్పెక్టర్ రాములు, అదనపు ఇన్‌స్పెక్టర్ అభిలాష్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. ఒడిస్సాకు చెందిన లలిత్ మండి(22) ఆరు నెలలుగా నగరంలో అవసరం ఉన్న వారికి హాష్ ఆయిల్,గంజాయి సరఫరా చేస్తున్నాడు. ఒరిస్సాకే చెందిన శరత్‌పూజారి హాష్ ఆయిల్, గంజాయిని అతడికి పంపుతున్నాడు. అంతే కాకుండా లలిత్‌మండికి కమీషన్ ఇస్తూ తాను చెప్పిన కస్టమర్లకు అందించేలా పకడ్బందీగా వ్యవహరిస్తున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న టప్పాచబుత్ర పోలీసులు, దక్షిణ,పశ్చిమ మండలం పోలీసులతో కలిసి జిర్రాలో లలిత్‌మండిని పట్టుకున్నారు. స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా హాష్ ఆయిల్, గంజాయి సరఫరా చేస్తున్నట్లు తెలిపాడు. నిందితుడి వద్ద పోలీసులు 1100 గ్రాముల హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

9న తెలంగాణ మహిళా ఉద్యమకారుల శిక్షణ

చిక్కడపల్లి, ఫిబ్రవరి 7: తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 9న తెలంగాణ మహిళా ఉద్యమకారుల శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు కమిటీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఉతమ్మల ప్రఫుల్ రాంరెడ్డి తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ అత్యవసర సమావేశం శుక్రవారం చిక్కడపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. మేడిపల్లి, ఫిర్జాదీగూడ పరిధి సత్యనారాయణపురం కాలనీ రోడ్డు నంబర్ 13లో ఉదయం 8 నుంచి సాయంత్రం 8 గంటల వరకు శిక్షణ శిబిరం కొనసాగనుందని, వందలాది మంది మహిళా ఉద్యమకారులు పాల్గొంటారని వివరించారు. రాబోయే రోజుల్లో ఉద్యమకారుల పాత్ర, ఉద్యమకారుల హక్కుల అంశాలపై చర్చించనున్నట్లు చెప్పారు. చంద్రన్న, ప్రసాద్, పి.యాదగిరి, డోలక్ యాదగిరి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అంబర్‌పేట, ఫిబ్రవరి 7 : అంబర్‌పేట నియోజకవర్గంలోని బసంత్‌కాలనీ నుంచి టూరిస్ట్ హోటల్ ఫీడర్ వరకు ఇంటర్ లింక్ పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు సీబీడీ ఏడీఈ జి.నాగేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు.

11 కేవీ బసంత్ కాలనీ ఫీడర్(33/11 కేవీ విటల్‌వాడీ) పరిధిలో బసంత్ కాలనీ, లింగంపల్లి, వైశ్య హాస్టల్, వెంకటరమణ థియేటర్, జైన్ మందిర్, కాచిగూడ క్రాస్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఆసిఫ్‌నగర్ విద్యుత్ సబ్‌డివిజన్‌లో..

మెహిదీపట్నం : విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా ఆసిఫ్‌నగర్ విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలోని 11 కేవీ అంజుమన్ ఫీడర్, గొల్లబస్తీ ఫీడర్, అంబాహాస్పిటల్ ఫీడర్,కాకతీయనగర్ ఫీడర్, వినోభానగర్ ఫీడర్, ఒయాసిస్ స్కూల్ ఫీడర్, హకీంషా ఫీడర్,11 కేవీ హకీంపేట్ ఫీడర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మెహిదీపట్నం సీబీడీ ఏడీ ఒక ప్రకటనలో తెలిపారు.

ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు.. అంజుమన్,ఆసిఫ్‌నగర్, హుమాయూన్‌నగర్,జహరా మసీద్,క్యాస్టిల్స్ హిల్స్,క్రిసెంట్ హాస్పిటల్,ఎన్ ఆర్ఐ కాలనీ, కేజీఎన్ హోటల్ ప్రాంతాలు, మధ్యాహ్నం 3 నుంచి సాయం త్రం 4:30 గంటల వరకు... గుడిమల్కాపూర్, వీబీజీ గార్డెన్, నవోదయ కాలనీ, సాబెర్‌నగర్, గొల్లబస్తీ, ఉదయం 10:30 గంటల నుంచి 11 వరకు... గోకుల్ నగర్, కైలాష్‌నగర్, షాన్‌నగర్, ఫెరోజ్‌గాంధీ నగర్ నాలా, ఇందిరానగర్, మోజంపురా, హాశంనగర్, అంబాహాస్పిటల్, మల్లేపల్లి, ఉదయం 11నుంచి 12:30 గంటల వరకు... కాకతీయనగర్, సాలార్జంగ్‌కాలనీ, గ్రేవ్‌యార్డు, మిలటరీ ఏరియా, ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు... దత్తాత్రేయనగర్ కాలనీ, ఐకమత్యనగర్ కాలనీ,వినోభానగర్,ఓయా కాలనీలో కొంత ప్రాంతం, డ్రీమ్ వ్యాలీ, మధ్యాహ్నం 12 నుంచి 12:30 గంటల వరకు... ఒయాసిస్ స్కూల్,ఫాల్కన్ వ్యాలీ,మధ్యాహ్నం 3 నుంచి 3:30 గంటల వరకు... హకీంషాకుంట, బృందావన్ కాలనీ, ఛోటా, బడా జానకీనగర్,డీలక్స్ కాలనీ,పారామౌంట్ గేట్-1, సాయంత్రం 4 నుంచి 4:30 గంటల వరకు... హకీంపేట్,అల్ హస్నత్‌కాలనీ, యూసుఫ్ టెక్డి, మెరాజ్‌కాలనీ, మిలటరీ ప్రాంతం, మందార్ రెస్టారెంట్ ప్రాంతాలు

బాడీ బిల్డింగ్‌తో శరీర దారుఢ్యం

మెహిదీపట్నం ఫిబ్రవరి 7: బాడీబిల్డింగ్‌తో శరీర దారుఢ్యం పెరుగుతుందని నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ అన్నారు. ఈనెల 9న ఎల్‌బీ స్టేడియంలో షఫీ సమీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఫిట్‌నెస్ ఫెస్టివల్ బాడీ బిల్డింగ్ పోటీల పోస్టర్‌ను శుక్రవారం మెహిదీపట్నంలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువతలో క్రీడలపై ఆసక్తిని పెంచేందుకు ఫిట్‌నెస్ క్లబ్‌లు ముందుకు రావాలన్నారు.

కుష్టు నివారణపై విద్యార్థులకు అవగాహన

రామంతాపూర్,ఫిబ్రవరి 7: రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ప్రపంచ కుష్టు వ్యాధి దినం సందర్భంగా విద్యార్థులకు కుష్టు వ్యాధి నివారణ పై అవగాహన కల్పించారు. ఇండియన్ అసోసియేషన్ కోశాధికారి లెప్రోలజిస్టు డాక్టర్ రాజ్యలక్ష్మి కోనాధన్ మాట్లాడుతూ కుష్టును ముందుగా రోగ నిర్ధారణ ,ఎండీటీ బ్లిస్టర్ ప్యాక్‌లలో క్యాప్ రిఫాంఫిసిన్ ట్యాబ్ డాప్సోన్ ట్యాబ్ క్లోఫాజమైన్ మల్టి డ్రగ్ థెరపీ ద్వారా సమస్యను నివారించవచ్చునన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సుజయ్ సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు కార్పెట్లు అందజేత

బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 7: లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో భోలక్‌పూర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు రెండు కార్పెట్లను అందజేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడానికి చేస్తున్న ఉపాధ్యాయులను వారు అభినందించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ అధ్యక్షుడు శేరిపల్లి గణేశ్, ప్రతినిధులు డాక్టర్ ప్రహ్లాద్, సుబ్రమణ్యం, హేమంత్‌కుమార్, సుమన్, రామ్మూర్తికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వరూప ధన్యవాదాలు తెలిపారు.